

వేములవాడలో 'హైడ్రా' గుబులు?

- రెండో బైపాస్‌లో అధికారుల సర్వే
- మూలవాగు పరీవాహకంలో హద్దుల ఏర్పాటు
- హైడ్రా తరహా తనిఖీలపై ప్రజల్లో ఆందోళన

వేములవాడ, సెప్టెంబర్ 11: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మూలవాగు పరీవాహక ప్రాంతంలో బుధవారం అధికారులు సర్వే చేపట్టడంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. వేములవాడ పట్టణం మూలవాగుకు పరీవాహక ప్రాంతంగా ఉండగా, గత బీఆర్‌ఎస్ హయాంలో మొదటి బైపాస్ రహదారిలో బఫర్ జోన్ హద్దులను నిర్ణయించి అధికారులు నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. తాజాగా రెండో బైపాస్ రహదారి వద్ద అధికారులు బుధవారం సర్వే చేయడం కలకలం రేపింది. సర్వేయర్, మున్సిపల్, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన అధికారులు సుమారు రెండు కిలోమీటర్ల పొడవు ఉన్న మూలవాగు బఫర్ జోన్ హద్దుల ఏర్పాటుకు సర్వే చేశారు. ఇందులో భాగంగా దాదాపు 40 కట్టడాల వరకు గుర్తించినట్లుగా సమాచారం. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశాలతో సర్వే నిర్వహించడంతో హైడ్రా తరహాలో కూల్చివేతలు ఉంటాయన్న పుకార్లు షికారు చేస్తుండగా, వేములవాడ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సర్వేలో ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా ఇన్‌చార్జి ఏడీ సర్వేయర్ వినయ్, డీఐ బాలచంద్రం, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, సంపత్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రాజన్న సిరిసిల్ల వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రహదారి మూలవాగు పరిసరాల్లో హద్దులు నిర్ణయించేందుకు సర్వే చేస్తున్న ఇరిగేషన్, సర్వే విభాగం అధికారులు

కోర్టుకెళ్లినా వదలం కూల్చేసుడే

> మొదటిపేజీ తరువాయి...

చేశారు. హైడ్రాపై కొందరు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు వస్తున్నాయని చెప్పారు. కొందరు బడాబాబులు చెరువుల్లో అక్రమ నిర్మాణాలు కట్టి, డ్రెయిన్ వాటర్‌ను చెరువుల్లోకి వదులుతున్నారని, ఆ నీటిని హైదరాబాద్ ప్రజలకు ఇవ్వాలా? అని ప్రశ్నించారు. ఆక్రమణలతో చెరువులు నిండిపోవడంతో వానకాలం వరదలతో పేదల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే చెరువుల్లోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి తీరుతామని, నా లాల ఆక్రమణలను నిరభ్యంతరంగా కూల్చేస్తామని స్పష్టంచేశారు. చెరువులను చెరబట్టిన వారి నుంచి వాటిని విడిపించడమే హైడ్రాకు తామిచ్చిన టాస్క్ అని పేర్కొన్నారు. త్వరలోనే ఆక్రమణలు తొలగించి మూసీని ప్రక్షాళన చేస్తామని, మూసీ నాలాల్లోని శాశ్వత నివాసదారులకు డబుల్‌బె డ్రూం ఇండ్లు అందిస్తామని తెలిపారు. మూసీ ప్రక్షాళనలో ఇండ్లు కోల్పోయే 11-14 వేల మందికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని చెప్పారు. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో నిర్మాణాలను రెగ్యులరైజ్ చేసే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.

27 రోజుల్లో 18 వేల కోట్ల రుణమాఫీ

తమ ప్రభుత్వం పెట్టుబడులు తీసుకురావడమే కాకుండా.. రైతన్నలు, నేతన్నలు, గీతన్నలను ఆదుకుంటున్నదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ క్రమంలో సరిగ్గా 27 రోజుల్లోనే 22,22,685 మంది రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమ చేసి రుణమాఫీ చేసినట్టు వివరించారు. దేశంలోనే ఇదొక కొత్త చరిత్ర అని చెప్పారు. కడుపు కట్టుకుని, నిధులు సేకరించి రుణమాఫీ చేసి రైతుల కండ్లల్లో ఆనందం చూస్తున్నామని పేర్కొన్నారు. పెట్టుబడులు తీసుకొనిరావడం ద్వారా లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే పనిలో ఉన్నామని చెప్పారు. అయితే, సీఎం అధికారిక కార్యక్రమాల్లో రాజకీయ విమర్శలు చేయడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఈ తరహా వ్యాఖ్యలు సీఎంకు తగవని అంటున్నారు.



హైడ్రా అనుమతిస్తేనే ఇంటి నిర్మాణం!

- ఎన్‌ఓసీ తప్పనిసరి చేస్తూ సర్కారు మెలిక
- 'టౌన్‌ప్లానింగ్' నిర్వీర్యం దిశగా అడుగులు
- సివిల్ ఇంజినీర్ల బాధ్యత పోలీసుశాఖకు?
- చట్టబద్ధత లేని సంస్థకు అధికారాలపై విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : చెరువులు, జలాశయాలను కబ్జాల నుంచి కాపాడేందుకు ఏర్పాటు చేసిన హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)కు మరిన్ని అధికారాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలిసింది. నీటి వనరుల సమీప ప్లాట్లలో ఇకనుంచి ఇంటి అనుమతులు పొందాలంటే హైడ్రా నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం(ఎన్‌వోసీ) తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఎక్కడైనా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఇంటి నంబరును రద్దుచేయడంతోపాటు కరెంటు, నల్లా కనెక్షన్లను కూడా తొలగించేందుకు ఉత్తర్వులు వెలువడతాయని తెలిసింది. ఇప్పటివరకు ఇంటి అనుమతుల కోసం ఉన్న టౌన్‌ప్లానింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ దాని అధికారాలను ఎలాంటి చట్టబద్ధత లేని హైడ్రాకు అప్పగించాలని చూడడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చట్టబద్ధంగా టౌన్‌ప్లానింగ్

సహజంగా ఇంటి అనుమతులు జారీచేసేందుకు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో టౌన్‌ప్లానింగ్ పేరుతో చట్టబద్ధమైన వ్యవస్థ పనిచేస్తున్న విషయం విదితమే. అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించిన తర్వాత అన్నీ సవ్యంగా ఉంటేనే ఈ విభాగం అనుమతుల కోసం సిఫారసు చేస్తుంది. టౌన్‌ప్లానింగ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన దరఖాస్తులకు మున్సిపల్ కమిషనర్లు అనుమతులు జారీచేస్తారు. ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని చెరువులు, రిజర్వాయర్లు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూములు తదితర అంశాల సమగ్ర సమాచారం టౌన్‌ప్లానింగ్ విభాగం వద్ద నిక్షిప్తమై ఉన్నది. అంతేకాదు, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన టీఎస్ బీపాస్ సింగిల్ విండో విధానంలో దరఖాస్తుదారులు ఎక్కడికీ తిరగకుండానే ఆన్‌లైన్ ద్వారా శీఘ్రగతిన అనుమతులు పొందే వీలున్నది. టౌన్‌ప్లానింగ్ విభాగం బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే అనుమతులు జారీచేస్తుంది.

వారి బాధ్యత పోలీస్ శాఖకు?

కూల్చివేతల కోసం హైడ్రా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఇంటి అనుమతులకు హైడ్రా నుంచి ఎన్‌వోసీ పొందాలనడం విమర్శలకు తావిస్తున్నది. టౌన్‌ప్లానింగ్‌లో నిపుణులైన సివిల్ ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్‌లు చేయాల్సిన పనులను పోలీసు శాఖ ఆధీనంలోకి తెస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌ల నిర్ధారణ హైడ్రాకు ఎలా సాధ్యమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణ హైడ్రాకు అప్పగించాలంటే హైడ్రాలో టౌన్‌ప్లానింగ్ అధికారులను నియమించుకోవాల్సి ఉంటుంది. అంటే, కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా ఇంతకాలం టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేసిన సిబ్బంది ఇకనుంచి హైడ్రా ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుందని చెప్పవచ్చు. దీనివల్ల ప్రభుత్వం ఎలాంటి మార్పు ఆశిస్తున్నదో అంతుబట్టడంలేదు.

చట్టబద్ధత లేని సంస్థకు మరిన్ని అధికారాలా?

హైడ్రాకు అసలు చట్టబద్ధతే లేదని పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్న క్రమంలో దానికి మరిన్ని అధికారాలు కల్పిస్తుండడం చర్చనీయాంశమైంది. అక్రమంగా అనుమతులు జారీచేసే అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి దేశంలో ఎక్కడా లేనివిధంగా అనాదిగా వస్తున్న టౌన్‌ప్లానింగ్ వ్యవస్థనే నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం వివాదాస్పదమవుతున్నది. దీనివల్ల భవిష్యత్తులో ఇంటి అనుమతి కోసం వెళ్లేవారు హైడ్రా చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది.

రియల్ ఎస్టేట్ సర్వనాశనం

> మొదటిపేజీ తరువాయి...

హైడ్రా పేరిట డ్రామాలు చేస్తున్నదని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన రూ.800 కోట్ల ఉపాధి హామీ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని తెలిపారు. బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పర్యటించిన ఆయన, ఇటీవల ఖమ్మం పర్యటనలో కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడి దవాఖానలో చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు యావన్నగారి సంతోష్‌రెడ్డిని గుమ్మడిదలలో పరామర్శించారు. అంతకు ముందు శివ్వంపేటలో స్థానిక నాయకులు, కార్యకర్తలు హరీశ్‌కు ఘనస్వాగతం పలికారు. మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లో స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ యూట్యూబ్‌లను చూస్తే రేవంత్‌రెడ్డికి వెన్నుల్లో వణుకు పుడుతున్నదని ఎద్దేవాచేశారు. ఫార్మాసిటీ, మెట్రోరైలు విషయంలో సీఎం రూటు మార్చారని మండిపడ్డారు. రేవంత్ తొందరపాటు వల్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి వచ్చిందని చెప్పారు. 'ఏ గ్రామానికైనా వెళ్దాం.. వందశాతం రుణమాఫీ అయ్యిందో? లేదో? తేల్చుకుందామా?' అని సవాల్ విసిరారు. భువనగిరి నియోజకవర్గంలో రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ నాయకులను రైతులంతా కలిసి రూమ్‌లో వేసి తాళం వేశారని గుర్తుచేశారు.

రేషన్‌కార్డు నిబంధనల వల్లే రైతు ఆత్మహత్య

రేషన్‌కార్డ్ నిబంధనలు పెట్టడం వల్లే రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని హరీశ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 50 శాతానికి మించి రుణమాఫీ కాలేదని చెప్పారు. 41 లక్షల మందికి రుణమాఫీ కావాల్సి ఉంటే 20లక్షల మందికే చేశారని, ఇంకా 21 లక్షల మందికి మాఫీ కాలేదని తెలిపారు. రైతులకు వందశాతం పంటల రుణాలు మాఫీ అయ్యేదాకా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని చెప్పారు. పంట బీమా, భరోసా కల్పించకపోతే రైతుల తరఫున ఆందోళనలు చేస్తామని ప్రకటించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రెండుసార్లు రుణమాఫీ చేసిందని, ప్రతి పంట సాగుకు ముందే రైతుబంధు అందించి రైతులకు దన్నుగా నిలిచిందని గుర్తుచేశారు.

పది నెలలుగా గ్రామాలకు నిధుల్లేవ్

కాంగ్రెస్ పాలనలో 10 నెలల నుంచి గ్రామ పంచాయతీలకు నిధుల్లేవని హరీశ్ రావు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చిపెడుతున్నారని, ఒక్క పైసా కూడా పంచాయతీలకు ఇవ్వడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రతి నెల పల్లె ప్రగతి ద్వారా నిధులిచ్చి గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు. చెక్‌డ్యామ్‌లు, ధాన్యం కొనుగోళ్లు, రైతుబీమాకు ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విషజ్వరాలతో ప్రజలు బాధపడుతూ దవాఖానల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏ ప్రభుత్వ దావాఖానకు వెళ్లినా మందుల కొరత ఉన్నదని చెప్పారు. కుక్కల దాడులు పెరుగుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడ్డారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని, స్కూల్, హాస్టళ్లలో భోజనం కూడా సరిగా ఉండడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. 10 నెలలవుతున్నా మధ్యాహ్న భో జన నిధులను మంజూరు చేయలేదని వెల్లడించారు. బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణ ప్రజలను మోసం చేశాయని ధ్వజమెత్తారు. గ్రా మ, పట్టణాలకు ఇంతవరకు ఎంత నిధులు మంజూరు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించి సాయం చేసేందుకు వెళ్లిన తమపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం అప్రజాస్వామ్యమని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడి చేసిన వారిపై కేసులు పెట్టాల్సింది పోయి తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. త్వరలోనే ప్రజలు కాంగ్రెస్ సర్కారుకు తగిన బుద్ధి చెప్తారని హరీశ్ హెచ్చరించారు.

హైడ్రా కూల్చివేతలు ఇలా

ప్రాంతం	కూల్చివేతల తేదీ/తొలగించినవి	ఆక్రమణలు/ వాటి విస్తీర్ణం (ఎకరాల్లో)
ఫిలింనగర్ కో ఆపరేటివ్ సొసైటీ	జూన్ 27 / 1	లోటస్‌పాండ్ పార్కుస్థలం కంపౌండ్ వాల్ /0.16
మన్సురాబాద్/సహస్ర ఎస్టేట్ రోడ్	1-7-24/1	రహదారి ఆక్రమణ/0.2
ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ ప్లాన్ నం 315	4-7-24/3	పార్కు స్థలం కబ్జా/0.06
బంజారాహిల్స్, మిథాల నగర్	5-7-24/2	పార్కు స్థలం /1.04
ఫిలింనగర్, బీజేఆర్ నగర్	14-7-24/1	నాలా ఆక్రమణ/ 5
గాజుల రామారం, మహదేవ్‌పూర్	21-7-24/1	పార్కులో నిర్మాణాలు /0.01
గాజుల రామారం, భూదేవిహిల్స్	23-7-24 /5	చెరువు ఆక్రమణ /1.1
జూబ్లీహిల్స్ బేబీలాన్ రెస్టారెంట్	27-7-24/1	ఫుట్‌పాత్‌ల ఆక్రమణ /0.05
అమీర్‌పేట నాలా	3-8-24 /3	నాలా ఆక్రమణ /0.01
చింతల్ చెరువు, గాజుల రామారం	6-8-24/54	చెరువు ఆక్రమణ /3.5
జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్	9-8-24/16	పార్కు స్థలం కబ్జా/0.18
రాజేంద్రనగర్,బుమారక్ లేక్	10-8-24/45	చెరువుల్లో నిర్మాణాలు/12
చందానగర్/ఈర్ల చెరువు	10-8-24/3	అక్రమ నిర్మాణాలు /0.16
బాచుపల్లి/ఎర్రకుంట	14-8-24/3	చెరువులో నిర్మాణాలు /0.29
బోడుప్పల్ సర్వే నం 3	14-8-24/1	ప్రభుత్వ స్థలం కబ్జా /0.03
ఖానాపూర్, గండిపేట	18-8-24/14	చెరువుల్లో భవనాలు /8.75
గండిపేట/చిలుకూరు	18-8-24/10	ఉస్మాన్‌సాగర్ చెరువు పరిధిలో నిర్మాణాలు /6.5
ఎన్ కన్వెన్షన్, తుమ్మిడికుంట చెరువు	24-8-24/2	ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు / 4.9
మణెమ్మగల్లీ, రామ్‌నగర్	30-08-24/3	తాత్కాలిక షెడ్లు/0.30
అప్పచెరువు,సర్వే నెం,.176,178	31-08-24/14	షెడ్లు/3.2
అమీన్‌పూర్‌చెరువు, సర్వేనెం. 323,324,329	08-09-24/24	షెడ్లు, కాంపౌండ్‌వాల్స్/51.78
సున్నంచెరువు, సర్వే నెం.30, అల్లాపూర్‌సర్వేనెం.10,12,13,14,16, గుట్టల బేగంపేట, మాదాపూర్	08-09-24/42	షెడ్లు, ఆర్‌సీసీ నిర్మాణాలు, బిల్డింగ్స్/10
కత్వాచెరువు, సర్వేనెం.170/3, 170/4, మల్లంపేట, దుండిగల్	08-09-24/13	విల్లాలు/2.50
మొత్తం	కాపాడిన స్థలం	111 ఎకరాల 72 గుంటలు

కలికి మేడ భద్రం.. పేద బతుకు ఛిద్రం

> మొదటిపేజీ తరువాయి...

విమర్శలు వస్తున్నాయి. మొత్తంగా హై'డ్రా మా'లో సామాన్యులే సమిధలవుతున్నారని స్వయంగా హైడ్రా గణాంకాలే స్పష్టంచేస్తున్నాయి. ఏర్పాటు నుంచి ఈ నెల 8 వరకు జరిపిన కూల్చివేతలపై హైడ్రా బుధవారం నివేదిక విడుదల చేసింది. చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, జంట జలాశయాల ఎఫ్‌టీఎల్‌లో కట్టడాలు, పార్కు స్థలాల్లో 262 నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది. ఇందులో కూల్చివేతలు జరిపిన 23 ప్రాంతాల్లో గండిపేట ఖానాపూర్, మల్లంపేట విల్లాలు, నాగార్జున ఎన్ కన్వెన్షన్ మినహా మిగతా చోట్ల సామాన్యుడిపైనే బుల్డోజర్ ప్రతాపం చూపినట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరీ సీడ్స్ అధినేత జీవీ భాస్కర్‌రావు, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌రెడ్డి, ప్రో కబడ్డీ ఓనర్ అనుపమ, సినీ హీరో నాగార్జున తప్ప మిగిలిన పెద్దలు అక్రమంగా కట్టుకున్న భారీ భవంతులు, విల్లాలు, ఫాంహౌస్‌ల వైపు బుల్డోజర్లు వెళ్లలేదు. బాచుపల్లిలో లేక్‌వ్యూ పాయింట్ తీరాన ప్రముఖంగా పేరొందిన బిల్డర్ కడుతున్న హైరైజ్ బిల్డింగ్ వైపు కూల్చివేతలకు వెళ్లిన హైడ్రా బుల్డోజర్లు తిరిగి వెంటనే వెనక్కి వచ్చాయి. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దలకు భారీగా ముడుపులు అందాయన్న చర్చ బిల్డర్లలో జరుగుతున్నది. సున్నం చెరువుకు సంబంధించి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, కనీసం ఇంట్లో ఉన్న సామాన్లను సర్దుకునే సమయం ఇవ్వకుండా సామాన్యుడిని రోడ్డున పడేసి గుండె కోత మిగిల్చిన హైడ్రా..జయభేరి లాంటి ప్రముఖులకు మాత్రం నోటీసులతో సమయమివ్వడం పట్ల ప్రజలు భగ్గుమంటున్నారు. ప్రభుత్వం హైడ్రా పేరుతో హైడ్రామా ఆడుతున్నదని మండిపడుతున్నారు.

సీఎం, కమిషనర్ తలోమాట

అక్రమిత స్థలాల్లో ఉంటున్న వారిపై హైడ్రా కొరఢా ఝుళిపిస్తుండగా కూల్చివేతలపై హైడ్రా చైర్మన్ అయిన సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటనలు గ్రేటర్ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఇటీవల సున్నం చెరువు, మల్లంపేట విల్లాల కూల్చివేతల సమయంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించి సామాన్యులు ఇప్పటికే నివాసం ఉంటున్న గృహాలను కూల్చబోమని ప్రకటించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కట్టడాలను మాత్రమే తాము కూల్చుతున్నామని స్పష్టం చేశారు. అయితే ఇందుకు విరుద్ధంగా బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఆక్రమణలను కూల్చే బాధ్యత తానే తీసుకుంటానని, ఆక్రమణలకు పాల్పడిన ఎవ్వరినీ వదిలి పెట్టబోనని, కూల్చివేతలపై స్టే తెచ్చుకున్నా కోర్టులో కొట్లాడుతామని స్పష్టం చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను ఆక్రమించిన వారినీ వదిలేది లేదని, ఆక్రమణలను వదిలి గౌరవంగా తప్పుకోండని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఒక మాట..కమిషనర్ మరో మాట మాట్లాడుతుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. వాస్తవంగా జూలై 19న హైడ్రా ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసిన ప్రభుత్వం నేటికీ విధి విధానాలు ప్రకటించలేదు. పరిధి దాటి హైడ్రా కూల్చివేతలు జరిపింది. జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా హైడ్రాను తీసుకొచ్చి చట్టబద్ధత కల్పించలేదు.

స్వాధీనం సరే..తట్టెడు మట్టి తీయలే

హైడ్రా ఇప్పటి వరకు 262 నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది. ఇందులో అత్యధికంగా అమీన్‌పూర్ లేక్‌కు సంబంధించి 51.78 ఎకరాలు, రాజేంద్రనగర్ బుమ్రాక్ 12, సున్నం చెరువు 10, గండిపేట లేక్ 8.75, చిల్కూరు 6.5 ఎకరాలతో పాటు మొత్తం 23 ప్రాంతాల్లో భూములను స్వాధీనం చేసుకున్నట్టు స్పష్టం చేసింది. వాస్తవంగా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాల వెంట వెలసిన కట్టడాలను కూల్చివేసిన హైడ్రా, వాటి వ్యర్థాల (డెబ్రీస్)ను ఎక్కడికక్కడే వదిలి వేసింది. కనీసం తట్టెడు చెత్తను కూడా తరలించలేదు. 111 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించిన హైడ్రా.. చెత్త, డెబ్రీస్‌ను ఎత్తివేయకుండానే చెరువులను పరిరక్షించామని చెబుతుండడం విస్తుగొలుపుతున్నది.

అసైన్డ్ భూమి ఔట్!

> మొదటిపేజీ తరువాయి...

మార్కెట్లో ఏకంగా రూ.570 కోట్ల విలువైన భూముల్ని అగ్గువకు చేజిక్కించుకొని రియల్ ప్రాజెక్టులతో రూ.వేల కోట్లు గడించేందుకు భారీ స్కెచ్ వేసిన ఒక కంపెనీ అనధికారికంగానే ఈ భూములను కొనుగోలు చేస్తున్నది. ఇదంతా అధికార యంత్రాంగానికి తెలిసినా ఎవరికి వారు 'సంతృప్తి'గానే ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకోవటంతో రెవెన్యూ రికార్డుల్లో లావణి పట్టా భూములను సాధారణ పట్టా భూములకు మార్చేందుకు వేగంగా పావులు కదులుతున్నాయి. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' చేపట్టిన విచారణలో నకిలీ ఎన్వోసీని అడ్డుపెట్టుకొని కొందరు ఈ తతంగాన్ని నడిపిస్తున్నట్టు తెలిసింది. మరి ఈ భూములను కాపాడేందుకు రేవంత్ సర్కారు ఏం చర్యలు తీసుకుంటుంది?

***

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి ఖానాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 79లో సుమారు 250 ఎకరాల భూమి ఉన్నది. 1953లో భూ గరిష్ఠ పరిమిత చట్టం అమలులోకి వచ్చింది. అప్పటికే ఖానాపూర్ గ్రామంలో జాగిర్దార్ ఉన్నారు. ఆయనకు ఖానాపూర్‌తో పాటు యాచారం మండలం చింతుల్లలో వందల ఎకరాల భూములు ఉన్నాయి. భూగరిష్ఠ చట్టం రావడంతో ఆయన పేరు మీద ఉన్న వేల ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. ఖానాపూర్‌లోని సర్వే నంబర్ 79 లోని 250 ఎకరాల భూమిని కూడా ప్రభుత్వానికి అప్పగించారు. ఇందులో 60 ఎకరాల భూమిని గ్రామ అవసరాలకు కేటాయించారు. మిగిలిన భూమిని గతంలో జాగిర్దారీ కోరిక మేరకు అప్పటి ప్రభుత్వం ఖానాపూర్‌కు చెందిన 26 మంది భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేసింది. ఒక్కొక్కరి పేరిట 7 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. దీంతో ఆ రైతుల పేరిట రెవిన్యూ రికార్డుల్లో లావణి పట్టా భూములుగానే నమోదవుతూ వస్తున్నది. ప్రస్తుతం ధరణి రికార్డుల్లో కూడా సదరు 26 మంది రైతుల పేరిట ఈ భూములు లావణి పట్టాగా నమోదయ్యాయి. నిషేధిత జాబితాలోనూ ఈ సర్వే నంబర్ నమోదై ఉన్నది. అంటే ఈ భూములపై క్రయ, విక్రయాలు నిషేధం. అయితే ఈ భూములు హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారికి అతి సమీపంలో... ఫోర్త్ (ఫ్యూచర్ సిటీ) సిటీకి సైతం సమీపంలోనే ఉండటంతో కొందరి బడా వ్యక్తుల నజర్ ఈ భూములపై పడింది.

ప్రైవేటు సంస్థ పేరిట కొనుగోలు

ఈ భూములపై కన్నేసిన కొందరు వ్యక్తులు ఆరాధ్య హోలిస్టిక్ ఎల్‌ఎల్‌పీ కంపెనీ పేరుతో కొనుగోలు చేయటం మొదలుపెట్టారు. రైతులను నయానో.. భయానో.. నచ్చజెప్పి అనధికారిక ఒప్పందాలతో ఈ భూములను కొనుగోలు చేశారు. తొలుత 15 లక్షలతో మొదలైన ఈ కొనుగోలు ప్రక్రియ.. ఇప్పుడు ఏకంగా రూ.50 లక్షల వరకు చేరింది. దీనిపై 'నమస్తే తెలంగాణ' విచారణ చేపట్టగా.. 1950లోనే సర్వేనంబర్ 70లోని భూమిని జాగిర్దారీ భూమిగా ప్రకటించినట్టు తేలింది. ఈ మేరకు ఉర్దూలో ఉన్న ఆ ఒప్పంద ప్రతిని ఆంగ్లంలోకి కూడా అనువదించిన ప్రతి లభించింది. 'సర్వే నంబర్ 70లోని లావణి ఖాస్రా పట్టా భూమిని 26 మందికి పంపిణీ చేయడం జరిగింది. ఇది ముఖద్దం పట్వారీ సమక్షంలోనే పూర్తయింది. లేఖ నంబర్ 864, 865 తేదీ: 28.4.1953 ప్రకారం జమాబంధీ అమలు చేయడం జరిగింది. 1954లో ఆ 26 మంది ఆ భూముల్లో సేద్యం చేసి జొన్నపంట వేశారు. ఈ మేరకు జొన్న పండించినట్టు రికార్డుల్లో నమోదు చేయడం జరిగింది' అని రెవెన్యూ పాత రికార్డుల్లో నమోదై ఉన్నది. కానీ కొంతకాలంగా కొందరు వ్యక్తులు ఆ రైతుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా భూములను కొనుగోలు చేశారు.

20-30 శాతం రేటుకే హస్తగతం

వాస్తవానికి ఖానాపూర్ గ్రామపరిధిలో పట్టా భూముల విలువ ఎకరా రూ.3 కోట్లకు పైగానే ఉన్నది. కానీ ఇవి లావణి పట్టా కావటంతో తమకు దక్కిందే చాలు అని రైతులు అనుకుంటున్నారు. ఈ క్రమంలో బాట సరిగాలేని భూ ముల రైతులు రూ.12-15 లక్షల వరకు ఎకరా భూమిని విక్రయించగా, కొంత బాట సరిగా, ప్రధాన రహదారికి సమీపంలో ఉన్నవారు ఎకరా రూ.30-50 లక్షల వరకు విక్రయించారు. ఈ మేరకు అనధికారికంగానే ఒప్పందాలు చేసుకున్నారు. లావణి పట్టా అయినందున అధికారికంగా రిజిస్ట్రేషన్ కాకపోవటంతో ప్రస్తుతానికి న్యాయపరంగా ఎలాంటి చిక్కులు లేకుండా ఉండేలా బాండు పేపర్లపై ఒప్పందం చేసుకొని, రైతుల పాసు పుస్తకాలను సదరు కంపెనీ స్వాధీనం చేసుకున్నది. అసైన్డ్ భూముల కొనుగోళ్లకు రైతుల్లో ఒకరికి తెలియకుండా మరొకరికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు రేట్లు నిర్ణయిస్తున్నారు. ముందుగా రైతుల ఆధార్ కార్డులను పాత పాస్‌బుక్‌లను తీసుకుని వారి నుంచి అగ్రిమెంట్ చేసుకున్నారు. కొంతమంది రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ప్రమేయంతో కొంతమంది రైతులకు ఎక్కువ రేట్లు ఇవ్వగా, మరి కొంతమంది రైతులకు తక్కువ రేట్లు ఇచ్చారు. దీంతో రైతుల మధ్య ప్రస్తుతం ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి.

హైడ్రా రంగంలోకి దిగుతుందా?

వాస్తవానికి ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం రేవంత్ ప్రభుత్వం ప్రత్యేకంగా హైడ్రాను ఏర్పాటు చేసింది. ఈ మేరకు హైడ్రా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న కట్టడాలను కూల్చివేసింది. అదీ ప్రధాన నగరంలోని వాటిపైనే దృష్టిసారించింది. కానీ నగరానికి అతి సమీపంలోని ఇబ్రహీంపట్నం మండలంలోని 190 ఎకరాల ప్రభుత్వ భూమి అనేది సీఎం రేవంత్ రెడ్డి చెప్తున్న ఫ్యూచర్ సిటీకి అతి సమీపంలో ఉన్నది. అంటే భవిష్యత్తులో ఇది ప్రభుత్వానికి, ప్రజాప్రయోజనాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మరి.. రేవంత్ సర్కారు అనధికారికంగా జరిగిన ఈ విక్రయాలపై కొరడా ఝుళిపించి సర్కారు భూములను పరిరక్షిస్తుందా? అనేది ప్రశ్న. ముఖ్యంగా ఫోర్త్ సిటీ రానున్నందున ఇలాంటి అక్రమాలు ఇంకా ఎన్నో వెలుగుచూసే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో రేవంత్ సర్కారు చిత్తశుద్ధితో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు అడుగు ముందుకు వేస్తుందా? అనేది తేలాల్సి ఉన్నది.

రికార్డులన్నీ మాయం

ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులన్నీ ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవటం గమనార్హం. విశ్వసనీయ సమాచారం మేరకు ఒక మాజీ పట్వారీ ఇంట్లో వీటికి సంబంధించిన రికార్డులన్నీ ఉన్నట్టు తెలిసింది. వాస్తవానికి ఆది నుంచి లావణి పట్టాగానే రికార్డులు కొనసాగుతున్నప్పటికీ రెండు, మూడు సంవత్సరాల పాటు ఆర్‌వోఆర్‌లో పట్టా భూమిగా నమోదు చేశారు. దీని ఆధారంగానే ఇక ముందు ఆద్యంతం పట్టా భూమిగా రికార్డులను తారుమారు చేసేందుకు స్కెచ్ వేస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే నకిలీ ఎన్వోసీని సృష్టించి, దాని ఆధారంగానే కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసినట్టు సమాచారం.

1953లో లావుని పట్టాలు పొందిన రైతులు

1. చింతకాయల రామయ్య
2. మాదాసు రామయ్య
3. పడకంటి జంగయ్య
4. మాల జంగయ్య
5. మాదాసు చిన్నయ్య
6. దొంతరమోని కనిగా
7. చేతాల లక్ష్మయ్య
8. జాషువా
9. పంది ఎల్లయ్య
10. పంది రాములు
11. పంది రాజయ్య
12. ముత్తయ్య
13. మల్లయ్య
14. కట్టెల మారయ్య
15. చింతకాయల పెద్ద అచ్చయ్య
16. కావలి దుర్గయ్య
17. వనం మల్లయ్య
18. యాదయ్య
19. కాళ్ల జంగయ్య
20. పుల్లయ్య
21. కిష్టయ్య
22. సత్తయ్య
23. మల్లయ్యతో పాటు మరో ముగ్గురు రైతులకు ప్రభుత్వం అసైన్మెంట్ పట్టాలను ఇచ్చింది.